ఉపాధి కూలీలకు రక్షణ ఏదీ?

- ఎండలోనే మగ్గుతున్న కూలీలు
- కనిపించని తాగునీరు, టెంట్లు


బొక్కలోనిపల్లి శివారులోని అటవీ ప్రాంతంలో చెట్ల నీడన ఉన్న ఉపాధి కూలీలు

మహబూబ్‌నగర్ రూరల్: ఉపాధి కూలీలకు భానుడి నుంచి రక్షణ లేకుండా పోయింది. ఉదయాన్నే కూలీలకు ఎండలు చుక్కలు చూపిస్తున్నాయి. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పనులు చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఉపాధి హామీ చట్టంలో పని ప్రదేశంలో నీడ, తాగునీరు, ప్రథమ చికిత్స కిట్లు ఉంచాలని నిబంధనలు ఉన్నప్పటికీ ఎక్కడా అమలుకు నోచుకోవడం లేదు. గ్రామాల్లో పనులు జరుగుతున్న ప్రాంతాల్లో ఎలాంటి సౌకర్యాలు ఏర్పాటు చేయకపోవడంతో కూలీలు అవస్థలు పడుతున్నారు. ఎర్రటి ఎండలో కష్టపడి చెమటోర్చి పని చేసిన వారికి కాసేపు సేద తీరడానికి నీడ కరవైంది. మండలంలోని 26 గ్రామపంచాయతీల పరిధిలో మొత్తం 10,414 జాబ్‌కార్డులు ఉండగా, ప్రస్తుతం 2,183 మంది కూలీలు ఉపాధి పనులకు వెళ్తున్నారు. ప్రభుత్వం కొన్నేళ్లుగా టెంట్లు సరఫరా చేయకపోవడంతో చెట్ల నీడనే దిక్కయ్యింది. పనిచేస్తున్న సమయంలో గాయాలైతే ప్రథమ చికిత్స అందించేందుకు కిట్లు లేకపోగా, తాగడానికి నీటి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పనులు ముగించుకున్న తర్వాత రెండు, మూడు కిలోమీటర్లు ఎండలోనే నడుస్తూ ఇళ్లకు వెళ్తున్నారు.

మార్పులు సరే.. సౌకర్యాలు కరువు..

పథకం నిర్వహణలో అనేక మార్పులు తీసుకొచ్చిన కేంద్ర ప్రభుత్వం కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో శ్రద్ధ చూపడం లేదు. మండలంలో వేసవిలో ఇతర పనులు లేకపోవడంతో కూలీలు ఉపాధి హామీ పనులకు వెళ్తున్నారు. కూలీలు ఎండకు అవస్థలు పడుతున్నారు. వడదెబ్బకు గురవుతున్నారు. వీరికి ప్రస్తుతం కనీస సౌకర్యాలు కల్పించడంలో పట్టించుకోవడం లేదు. ఒకవైపు కూలీలకు వేతనాలు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేశారు. మరోవైపు కూలీలకు రెండు పూటల హాజరు తప్పనిసరి చేశారు. ఉదయం 11గంటలలోపు హాజరు వేసుకున్న కూలీలు మళ్లీ మధ్యాహ్నం 3గంటల తర్వాత హాజరు వేసుకోవాల్సి వస్తుంది. ఈ సమయంలో సేద తీర్చుకునేందుకు నీడ దొరకడం లేదు. ఇంటికి వెళ్తే మళ్లీ వచ్చేందుకు ఇబ్బంది అవుతోంది. రూ.257ల కూలీని రూ.272లకు పెంచింది. అయితే కూలీలకు గునపాలను మొన చేయించుకోవడానికి ఇచ్చే నగదును నిలిపివేసింది. అదేవిధంగా కూలీలు చేసిన పనులకు జియో ట్యాగింగ్ చేసింది. సాఫ్ట్‌వేర్ మారడంతో గత ఏడాది నుంచి వేసవి భత్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేసింది.

పని చేయలేకపోతున్నాం..



పనులకు రెండు పూటలా హాజరుతో ఇబ్బంది పడుతున్నాం. కనీసం తాగునీరు ఏర్పాటు చేయడం లేదు. ఒక బాటిల్ నీరు ఇంటి నుంచి తీసుకెళ్తే సాయంత్రం వరకు ఆ నీటినే సరిపుచ్చుకోవాల్సి వస్తోంది. వసతులు కల్పించాలని అధికారులను అడిగితే నిబంధనల్లో తాగునీరు, టెంట్ వసతి కల్పించడానికి లేదని చెబుతున్నారు.

– వెంకటమ్మ, ఉపాధి కూలీ, ఓబ్లాయిపల్లి

నిబంధనల మేరకు వసతులు..



ఉపాధిహామీ చట్టంలో ఉన్న నిబంధనల మేరకు వసతులు కల్పిస్తున్నాం. కూలీలు ఇంటి నుంచే తాగునీటిని తెచ్చుకోవాల్సి ఉంటుంది. ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచేందుకు సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాల సిబ్బందిని పనిచేసే ప్రాంతాల్లో పర్యటించేలా ఏర్పాట్లు చేస్తున్నాం. రెండు పూటలా కూలీల హాజరు తప్పనిసరి ఉండాలి.

– అహ్మద్‌ఖాన్, ఏపీఓ

శ్రీశ్రీకి ఘన నివాళి


జడ్చర్లలో శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న శివకుమార్


గండేడ్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు

జడ్చర్ల టౌన్: కవి శ్రీశ్రీ జయంతి పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని గాంధీ ట్రస్టు నగర్ కాలనీలోని సమావేశ మందిరంలో అభిమానులు ఘన నివాళులర్పించారు. రాష్ట్ర సంగీత నాటక అకాడమీ మాజీ చైర్మన్ బి.శివకుమార్ హాజరై శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శ్రీశ్రీ అభిమానులు చాంద్‌ఖాన్, నర్సింహులు, యాదగిరి, నయీమొద్దీన్ పాల్గొన్నారు.

గండేడ్: ప్రముఖ కవి శ్రీరంగం శ్రీనివాసరావు జయంతిని మండల కేంద్రంలో ఆదివారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పులమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, ఉమ్మడి పాలమూరు జిల్లా అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు కృష్ణయ్య, హన్మయ్య, మల్కయ్య, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ వైస్‌చైర్మన్‌కు దళితరత్న అవార్డు



జడ్చర్ల టౌన్: తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ప్రకటించిన దళితరత్న అవార్డును ఆదివారం నూతన సెక్రటేరియేట్‌లో మంత్రి కొప్పుల ఈశ్వర్ జెడ్పీ వైస్‌చైర్మన్ కోడ్గల్ యాదయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి యాదయ్య కృతజ్ఞతలు తెలిపారు.

దమాయపల్లిలో గురుపూజ



కోయిల్‌కొండ: మండలంలోని దమాయపల్లిలో బ్రహ్మంగారి గురుపూజా మహోత్సవం ఆదివారం నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకం కుంకుమార్చన కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వడ్లశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జునచారి, నాయకులు భీమాచారి, పాండుచారి, రాఘవచారి, వెంకటయ్యచారి, బ్రహ్మయ్యచారి తదితరులు పాల్గొన్నారు.

చంద్రాస్‌పల్లిలో ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన


పూజలు చేస్తున్న నాయకులు, భక్తులు

కోయిల్‌కొండ: మండలంలోని చంద్రాస్‌పల్లిలో ఆదివారం ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం ఎదుట ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలో మహిళలు పెద్ద సంఖ్యలో బోనాలు ఊరేగింపు చేపట్టారు. బీఆర్ఎస్ నియెజకవర్గ సమన్వయకర్త రవీందర్‌రెడ్డి, జెడ్పీటీసీ విజయ్‌భాస్కర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వాసవీ కన్యకా పరమేశ్వరి జయంతి


జడ్చర్లలో పూజలు చేస్తున్న మహిళలు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం బ్రాహ్మణవాడిలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో వాసవీమాత జయంతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం అమ్మవారి ఆభరణాల ఊరేగింపు, గణపతి పూజ, పుణ్యాహవాచనం, నవగ్రహ పూజ, ధ్వజారోహణం నిర్వహించారు. అమ్మవారికి విశేష అభిషేకాలు నిర్వహించి అలంకరించారు. నైవేద్యం, హారతి, మంత్ర పుష్పం, సాయంత్రం వాసవీ పారాయణం, డోలారోహణం నిర్వహించారు. జయంతి ఉత్సవాల్లో ఆలయ ప్రధాన అర్చకులు గొండ్యాల రాఘవేంద్రశర్మ, ఆర్యవైశ్య యువజన సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు. సోమవారం సాముహిక కుంకుమార్చన, అమ్మవారి శోభాయాత్ర నిర్వహించనున్నారు.

మహమ్మదాబాద్: ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవమైన వాసవీ కన్యకా పరమేశ్వరి జయంతిని గాధిర్యాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ ఆలయంలో ఆర్యవైశ్యులంతా పరమేశ్వరి చిత్రపటానికి పూలమాలలు వేసి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు అనంతయ్యగుప్త మాట్లాడుతూ ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవమైన కన్యకా పరమేశ్వరి మార్గదర్శకురాలని తెలిపారు. అందుకు ప్రతి ఏడాది జయంతి సందర్భంగా ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ మండల అధ్యక్షుడు ముచర్లగుప్త, కార్యదర్శి పద్మనాభం, కోశాధికారి నారాయణ, రమేష్‌గుప్త, గోవింద్ నారాయణ, కృష్ణ, ఆంజనేయులు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: వాసవీ కన్యకా పరమేశ్వరి జయంతిని పురస్కరించుకుని అవోపా ఆధ్వర్యంలో బాదేపల్లి వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, నిజాభిషేకం, పుష్పార్చన, సామూహిక కుంకుమార్చన, డోలాహరణం చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేశారు. సాయంత్రం అమ్మవారి పల్లకీసేవ నిర్వహించారు. వాసవీమాత జయంతిని పురస్కరించుకుని బాదేపల్లి సకలదేవతల ఆలయంలో పూజలు చేశారు. అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, గోపూజ, హోమం జరిపించి అన్నదానం చేశారు.

మిడ్జిల్: మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ కన్యకా పరమేశ్వరి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవీమాత విగ్రహానికి అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల ఆర్యవైద్య సంఘం అధ్యక్షుడు సత్యంగుప్త, విజయ్ కుమార్, భద్రయ్య, యాదగిరి, బాలస్వామి, నాగేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కోయిల్‌కొండ: మండల కేంద్రంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి మాత జయంతిని ఆదివారం ఆర్యవైశ్య సంఘం సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. సంఘం అధ్యక్షుడు అశోక్, రవి, ఆంజనేయులు, చంద్రయ్య, సునిల్ తదితరులు వాసవీ కన్యకా పరమేశ్వరి మాత చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు.


కోయిలకొండలో పూజలు చేస్తున్న ఆర్యవైశ్యులు


మిడ్జిల్‌లో..


మహమ్మదాబాద్‌లో..

క్లుప్తంగా

అమ్మవారికి ప్రత్యేక పూజలు



నవాబుపేట: మండలంలోని మైసమ్మ ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. ఆదివారం భక్తులు మైసమ్మ దేవతకు బోనాలు, మొక్కులు చెల్లించుకుని నైవేద్యాలు సమర్పించారు.

వీరబ్రహ్మేంద్రస్వామి రథోత్సవం



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజోత్సవాలు ఆదివారం ముగిశాయి. దేవతామూర్తుల పంచామృతాభిషేకం, అష్టోత్తర శతనామావళి తదితర పూజలు నిర్వహించారు. అనంతరం పలువురు భజనలు ఆలపించారు. మహోత్సవాల్లో దేవస్థానం అభివృద్ధి కమిటీ చైర్మన్ శేఖరాచారి, ప్రధాన కార్యదర్శి వి.నారాయణ, కోశాధికారి నారాయణ, నర్సింహాచారి, రాఘవాచారి, రమేశ్‌చారి, సత్తయ్య, రఘు, రవి, మల్లికార్జున్, లక్ష్మీనారాయణ, భిక్షపతి, బాలుచారి పాల్గొన్నారు.

నాటక ప్రదర్శనకు విరాళం



మహమ్మదాబాద్: ఆధ్యాత్మిక భావంతో మెలగాలని పరిగి ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి తెలిపారు. ఆదివారం గాధిర్యాల్‌లో వీరబ్రహ్మంగారి చరిత్ర నాటక ప్రదర్శనకు రూ.20వేల నగదు విరాళం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలోని ప్రజలు యువత ఆధ్యాత్మికతకు దూరమవుతున్న సమయంలో ఇలాంటి నాటక ప్రదర్శనలు ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. కార్యక్రమంలో హన్మంతుగౌడ్, శంకరయ్య, వెంకటయ్య, కేశవులు, మల్లయ్య, శ్రీను, అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

అడ్డాకుల: మండల కేంద్రానికి చెందిన సత్యారెడ్డి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా రోడ్డు ప్రమాదానికి గురై జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధిత కుటుంబాన్ని ఆదివారం జెడ్పీటీసీ సభ్యుడు ఎస్.రాజశేఖర్ రెడ్డి పరామర్శించారు. పరామర్శించిన వారిలో రైతుబంధు అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, నాయకుడు చంద్రమోహన్‌రెడ్డి ఉన్నారు.

ఆంగ్లభాషకు ప్రాధాన్యత



మహమ్మదాబాద్: ప్రస్తుత తరుణంలో ఆంగ్లభాషకు ఎంతో ప్రాధాన్యత సంతరించుకున్నదని గోర్‌శిక్వాడీ జిల్లా అధ్యక్షుడు ప్రభునాయక్ తెలిపారు. మండల కేంద్రంలో గోర్‌శిక్వాడీ ఆధ్వర్యంలో ఆదివారం స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని పేద పిల్లలకు స్పోకెన్ ఇంగ్లిష్ నేర్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రవీందర్‌నాయక్, శివనాయక్, గోపాల్, పాండు, పాల్గుణ, బాలు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ భరోసా సభను జయప్రదం చేయండి



మరికల్: బీఎస్పీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో మే 7న జరిగే తెలంగాణ భరోసా సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీనివాస్ అన్నారు. ఇందుకు సంబంధించిన గోడ పత్రికలను ఆదివారం మరికల్‌లో ఆవిష్కరించారు. సభకు పార్టీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి హాజరు కానున్నట్లు తెలిపారు. ఆంజనేయులు, వెంకటేష్, చంద్రయ్య, రవి, గోవింద్, అశోక్, బాల్‌చందర్, నర్సింహులు, కృష్ణ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహా ప్రతిష్ఠాపనోత్సవాలు


పూజలు చేస్తున్న నాయకులు

భూత్పూర్: మండలంలోని పోతులమడుగులో ఆదివారం దేవతామూర్తుల విగ్రహాలను భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించారు. గ్రామంలో కోట మైసమ్మ ,కట్టమ్మ, ఊరడమ్మ, సింహ వాహనం విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. గణపతి పూజ, యాగశాల ప్రవేశం, మండపారాధన, విగ్రహాల ఊరేగింపు, ధాన్యదివాసం తదితర పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు మనిమోని సత్యనారాయణ, డీసీసీ జిల్లా అధ్యక్షుడు జి.మధుసుదన్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి, ఎంపీటీసీ ఊషన్న, కాంగ్రెస్ నాయకులు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, హర్యానాయక్, కిష్టన్న, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ అభివృద్ధికి కృషి చేస్తాం


మాట్లాడుతున్న మార్కెట్ చైర్మన్ లక్ష్మయ్య

నవాబుపేట: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌ను మరింత అభివృద్ధి చేసి రైతులకు సౌకర్యాలు కల్పించేలా కృషి చేస్తామని మార్కెట్ చైర్మన్ లక్ష్మయ్య తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని మార్కెట్ కార్యాలయంలో పాలకవర్గం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్ ఆవరణలో వంద శాతం సీసీ రోడ్డుతో పాటు, మార్కెట్ ఆదాయం కోసం మరో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి తీర్మాణం చేసి అనుమతులకు సంబంధిత శాఖకు, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి పంపినట్లు వివరించారు. వీటిలో ఇటీవల రూ.20లక్షల సీసీ పూర్తి చేశామని, పనులు త్వరలో పూర్తి చేస్తామని పేర్కొన్నారు. మార్కెట్ అదనపు కాంప్లెక్స్‌కు రూ.70లక్షలు, రైతులకు మరుగుదొడ్లు, వసతుల నిర్మాణం కోసం మరో రూ.30లక్షలు అంచనాలు వేసినట్లు తెలిపారు. సమావేశంలో సహకార సంఘం చైర్మన్ నర్సింహులు, మార్కెట్ వైస్ చైర్మన్ చందర్, సర్పంచ్ గోపాల్‌గౌడ్, మార్కెట్ కార్యదర్శి శివకుమార్ రెడ్డి, డైరెక్టర్లు రవి, శశికుమార్, రాఘవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి


శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎన్‌పీ వెంకటేష్ తదితరులు

మహబూబ్‌నగర్ క్రీడలు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘం ఉపాధ్యక్షులు ఎన్‌పీ వెంకటేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మాడల్ బేసిక్ ఉన్నత పాఠశాలలో శ్రీహనుమాన్ కరాటే, యోగా అసోసియేషన్ ఫౌండర్, సీనియర్ కరాటే మాస్టర్ కె.వెంకటేష్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన వేసవి కరాటే శిక్షణా శిబిరాన్ని ఎన్‌పీ వెంకటేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో రాణించేవారు చదువులో కూడా ముందుంటారని తెలిపారు. ప్రస్తుతం కరాటే మార్షల్ ఆర్ట్స్‌కు ఎంతో ప్రాధాన్యత ఏర్పడిందన్నారు. చిన్నారులు కరాటే మార్షల్ ఆర్ట్స్ నేర్చుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. కరాటే శిక్షణ అందజేస్తున్న వెంకటేష్‌ను అభినందించారు. కరాటే మాస్టర్ మాట్లాడుతూ వేసవి కరాటే శిక్షణ 40రోజుల పాటు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, కె.నర్సింహులు, ప్రశాంత్, ముత్యం, రాంచంద్రయ్య, బాలకృష్ణ గౌడ్, సురేష్ కుమార్, సాంబశివుడు, మహేష్, శంకర్, శ్రీను, హరి, బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ సందేశ్ బైక్‌యాత్ర


బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

అడ్డాకుల: మండల కేంద్రంలో ఆదివారం కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ సందేశ్ యాత్రను నిర్వహించారు. రాజ్యాంగ రిజర్వేషన్లు, ప్రభుత్వరంగ పరిరక్షణ కోసం ఈనెల 2నుంచి చేపట్టిన యాత్రను కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మునగలశెట్టి బాలరాజు అడ్డాకులలో ప్రారంభించారు. దేశంలో రాజ్యాంగం ప్రమాదంలోకి నెట్టబడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని తీవ్రంగా వ్యతిరేకించే వారు దేశాన్ని పాలిస్తున్నారని విమర్శించారు. దళిత, గిరిజన, బలహీన వర్గాలకు విద్యా, భూమి, పరిపాలన హక్కులను నిరాకరించి వెట్టి చాకిరి చేయిస్తున్నారని వాపోయారు. కార్యక్రమంలో వెంకట్రాములు, దశరథ, రాకేష్, ప్రశాంత్, సునీల్, నాగార్జున, బాలు, దేవిపుత్ర, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

సంక్షేమ సేవా సంఘం కార్యవర్గం ఎన్నిక

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక క్రిస్టియన్‌పల్లి వార్డు నంబర్10లోని డబుల్ బెడ్రూం సంక్షేమ సేవా సంఘం కొత్త కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కె.పాండురంగం, ఉపాధ్యక్షుడిగా కె.నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా పి.మోహన్‌బాబు, కోశాధికారిగా పి.బాలకృష్ణ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సంఘం మాజీ అధ్యక్షుడు పి.వెంకటేశ్, సభ్యులు దండు దేవన్న, మల్లెల అనిల్‌కుమార్, జె.ఆంజనేయులు, పి.మోహన్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి సేవా సంఘం..



పాలమూరు: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం ఎన్నికలు ఆదివారం జిల్లా కేంద్రంలోని అశోక్ టాకీస్ చౌరస్తా సమీపంలో ఉన్న మార్కండేయ ఆలయంలో నిర్వహించారు. ఎన్నికల అధికారిగా దేవులపల్లి రాజేశ్వర్ వ్యవహరిస్తూ నూతన కమిటీని ఎన్నుకున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా కె.సు భాష్‌చంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాలకృష్ణ, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ సునీల్, ఉపాధ్యక్షులుగా ఆంజనేయులు, శ్యామ్‌సుందర్, రఘురాములు, సంతోషిణి, సంయుక్త కార్యదర్శులుగా శ్రీనివాస్, సూర్యనారాయణ, శ్రీపాదరావు, వెంకటస్వామి, కోశాధికారిగా కె.శ్రీనివాస్, ప్రచార కార్యదర్శిగా దివాకర్, కార్యనిర్వహక కార్యదర్శులతో పాటు సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం నూతన అధ్యక్షుడికి ఎన్నికల అధికారి నియామక పత్రం అందించారు.

రేవంత్‌రెడ్డికి ఘనస్వాగతం


రేవంత్‌రెడ్డికి గజమాలతో స్వాగతం పలుకుతున్న అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల టౌన్: నిరుద్యోగ నిరసన ర్యాలికి జిల్లా కేంద్రానికి వెళ్తున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి జడ్చర్ల క్రాస్‌రోడ్డు వద్ద ఘన స్వాగతం పలికారు. మాజీ ఎమ్మెల్యే యం.చంద్రశేఖర్, టీపీసీసీ నాయకుడు జనంపల్లి అనిరుధ్‌రెడ్డిలు పోటాపోటీగా ఆయనకు గజమాలలతో స్వాగతం పలికారు. మొదట అనిరుధ్‌రెడ్డి క్రేన్ సాయంతో భారీ గజమాలతో రేవంత్‌ను సత్కరించారు. అనంతరం ఎర్రశేఖర్ మరో క్రేన్ సాయంతో గజమాలతో స్వాగతం పలికారు. కరవాలం ఇచ్చి ఘనంగా సత్కరించారు. కరవాలన్ని చూయించి కార్యకర్తల్లో రేవంత్‌రెడ్డి జోష్ నింపారు. కాగా, స్వాగత విషయంలో ఇరువర్గాల మధ్య చిన్న తోపులాట చోటుచేసుకుంది.

చోరీకి విఫలయత్నం

అడ్డాకుల: మండల కేంద్రంలో మేకలు పట్టుకోవడానికి వచ్చిన ఇద్దరు దొంగల్లో ఒకరు పరారు కాగా, మరో దొంగను పట్టుకుని స్థానికులు పోలీసులకు అప్పగించారు. అడ్డాకుల ఎస్ఐ మాధవరెడ్డి వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్ జిల్లా ఓర్వకల్లు మండలం చింతలపల్లికి చెందిన భాస్కర్, మద్దిలేటిలు ఆటో తీసుకుని శనివారం రాత్రి అడ్డాకులకు వచ్చారు. జాతీయ రహదారి పక్కన ఉన్న ఆలేటి శివ ఇంటి బయట కట్టేసిన మేకల్లో రెండు మేకలను పట్టుకుని తీసుకెళ్లడానికి యత్నించారు. మేకలు అరవడంతో శివ తల్లిదండ్రులు బయటకు వచ్చి దొంగలను పట్టుకునే ప్రయత్నం చేశారు. ఇద్దరు దొంగల్లో భాస్కర్ ఆటో తీసుకుని పరారయ్యాడు. మరో దొంగ మద్దిలేటిని స్థానికులు పట్టుకుని చితకబాదారు. తర్వాత పోలీసులకు అప్పగించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు.